క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే కాసును కలిసిన జబ్బీర్



పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు జబ్బీర్ శనివారం కలిశారు. పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడుగా పదవి బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జబ్బీర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: ప్రసిద్ధ సింగరుట్ల లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ శివ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దేవదాయ ధర్మాదాయ చట్టంలోని నిబంధనలకు లోబడి ఫారం 2 ద్వారా పూర్తి చేసిన దరఖాస్తులను దేవదాయ శాఖ పల్నాడు జిల్లా అధికారికి సమర్పించాలని ఆలయ ఈఓ కోరారు.

అమ్మవారికి ముత్యాల హారం

కారెంపూడి: మండలంలోని చింతపల్లిలోని పాతపాటేశ్వరి అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తుడు ఉన్నం శ్రీనివాసరావు అమ్మవారి రూపుతో ఉన్న ముత్యాల హారాన్ని శుక్రవారం సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామ పెదకాపు ఉన్నం శ్రీనివాసులుకు దానిని అందజేశారు. కార్యక్రమంలో మాజీ కరణం చింతపల్లి సీతారామాంజనేయులు పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీ అమ్మవారికి బోనాల జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

మాచర్ల: అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పురపాలక సంఘ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. జూన్ 31 నాటికి అనధికార లేఅవుట్లు రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్నారు. ఈ స్కీమ్‌తో చట్టబద్ధత కల్పించబడుతుందని చెప్పారు. 45 రోజుల్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సాగులో ఉన్న ప్రతి ఎకరాను ఈ క్రాప్ నమోదు చేయాలి



కారెంపూడి: రైతులు తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పోట్ల నరసింహారావు కోరారు. మండలంలోని కారెంపూడి, చినకొదమగుండ్ల, ఒప్పిచర్ల, నరమాలపాడు గ్రామాలలో ఏఓ పర్యటించి ఈ క్రాప్ బుకింగ్ తీరును పరిశీలించారు. మండలంలో సాగు చేస్తున్న ప్రతి ఎకరా భూమిని ఈ క్రాప్ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని లేకుంటే ప్రభుత్వ పరంగా రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు దూరం అవుతాయన్నారు. శని, ఆదివారాలు సెలవు దినాలైనా ఈ క్రాప్ బుకింగ్ అనేది జరుగుతుందని పేర్కొన్నారు.

అనర్హులు ప్రభుత్వ వాహనం స్టిక్కర్లతో తిరగొద్దు

కారెంపూడి: ప్రభుత్వ వాహనం స్టిక్కర్‌తో ఉన్న వాహనంలో కారెంపూడిలో సంచరిస్తున్న వ్యక్తులను శుక్రవారం పోలీసులు అడ్డుకుని వారి నుంచి వివరాలు సేకరించారు. వాహనంలో ఉన్న వారిలో ఒకరు గరికపాటి రమేష్ రాజా హ్యూమన్ రైట్స్ కమిషన్ కౌన్సిలర్‌గా ఉన్నారని అతడికి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఎస్ఐ వాసు ఈ సందర్భంగా విలేకర్లకు తెలిపారు. అది ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వచ్ఛంద సేవా సంస్థ మాత్రమేనని ఇలా అని అధికార వాహనంగా తాము ప్రయాణిస్తున్న వాహనాన్ని వాడకూడదని సూచించారు. ఇలాఅనధికారికంగా ప్రభుత్వ వాహనం అని పేరు రాసుకుని తిరిగితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

సత్తెనపల్లి: వ్యక్తి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన పచ్చా హనుమంతరావు (52) ఈ నెల ఒకటో తేదీ నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యురాలు పచ్చా రమాదేవి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

దాచేపల్లి: శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్న భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక వీర్ల అంకమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరణ చేసిన తర్వాత భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వరలక్ష్మీ వ్రతం పూజలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేశారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మాశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల అందించారు.

రెంటచింతలలో..

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మూడో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు పూజలు, నోములు, వ్రతాలు చేయడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం, రెంటాల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి పట్టుచీర సమర్పణ

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారికి వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో శ్రావణమాసం, శుక్రవారం అమ్మవారికి అలంకరించేందుకు పట్టుచీరను సమర్పించినట్లు అధ్యక్షులు భవనారి సత్యనారాయణ, జయలక్ష్మి దంపతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దశాబ్దాలుగా ఏటా లక్షలాది మందికి తమ వంతు సహాయ సహకారాలందించటం సంతోషకరంగా ఉందన్నారు. సభ్యులు మేడం నాగేశ్వరరావు మాట్లాడుతూ వాసవి కుటుంబ సురక్షా పథకంలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరి వారి కుటుంబానికి అండగా నిలవాలన్నారు. వాసవి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ వాసవి క్లబ్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు లక్ష మందితో భారతదేశంలోనే కాకుండా సుమారు 10దేశాలలో తమ సేవలందిస్తుందన్నారు. సాయంత్రం పట్టణంలోని సొసైటీ కాలనీలోని శ్రీ అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి వాసవి క్లబ్ పల్నాడు ఆధ్వర్యంలో పట్టుచీర అందజేసినట్లు ప్రెసిడెంట్ భవనాశి రవితేజ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చుండూరు సత్యనారాయణ, సెక్రెటరీ బత్తుల బ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్, నేరెళ్ళ నాగేశ్వరరావు తదితరులున్నారు. సీనియర్ పాత్రికేయుడు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు చేసిన సేవలను గుర్తించిన విశ్వజననీ ఫౌండేషన్, నాంపల్లి, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో "సేవారత్న" అవార్డు పొందిన సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు.

ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో వాసవీ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దేవాలయంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు.



రెంటాల చెన్నకేశవస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం

మాచర్లలో...

మాచర్ల: పట్టణంలోని పలు దేవాలయాల్లో శ్రావణమాసం శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, సత్యసాయిబాబా దేవాలయంలోని లలితాదేవి, నెహ్రూనగర్ దేవాలయంలో ఆదిలక్ష్మి దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రెంటచింతలలో ప్రత్యేక అలంకారంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



మాచర్ల.. ప్రత్యేక అలంకరణలో ఆది లక్ష్మీ అమ్మవారు



పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వాసవీ అమ్మవారు



వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారికి పట్టుచీర సమర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అల్లయ్యకు సన్మానం



కారెంపూడి: వైఎస్సార్‌సీపీ కారెంపూడి పట్టణ అధ్యక్షునిగా వరసగా మూడో సారి నియమితులైన బొమ్మిన అల్లయ్యను దాచేపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, దాచేపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం రాత్రి కలసి సన్మానించారు. వైఎస్సార్ సీపీ దాచేపల్లి మండల అధ్యక్షుడు కోట కృష్ణ, నాయకులు మునగా శ్రీనివాసరావు, బొమ్మిరెడ్డి నరసింహారావు పాల్గొన్నారు.

అరెస్ట్ పేరిట భయపెట్టి నగదు వసూలు

ముప్పాళ్ల: అరెస్ట్ పేరిట భయపెట్టి నగదు వసూలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన అనుమాలశెట్టి శ్రీనివాసరావు ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. 'మీ అబ్బాయి బాల వెంకట సతీష్ అమ్మాయి వేధింపుల కేసులో ఇరుక్కున్నాడని, మేము ప్రభుత్వ అధికారులమని, అరెస్ట్ కాకుండా ఉండాలంటే రూ.50వేలు ఫోన్‌పే చేయా'లంటూ భయ భ్రాంతులకు గురి చేసి చేయించుకున్నారు. ఈ సంఘటనపై శ్రీనివాసరావు భార్య పద్మావతి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధితులతో సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయించి, డబ్బులు పంపిన ఫోన్ నంబర్ 9801241475ను బ్లాక్ చేయించి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

క్రోసూరు విద్యుత్ డీఈఈగా శ్రీనివాసరావు

క్రోసూరు: విద్యుత్ డీఈఈగా ఎం.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గురజాల ఏడీఈగా చేస్తూ కొత్తగా ఏర్పడిన క్రోసూరు రూరల్ సబ్ డివిజన్ డీఈఈగా బాధ్యతలు తీసుకున్నారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల డీఈఈగా పని చేయనున్నట్లు ఆయన వివరించారు. రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని, విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి శోభాయాత్ర

పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడులో గల అంకమ్మ తల్లికి రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా పూజలు జరిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి కర్ణం శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి చీర, సారెలతో శోభాయాత్రను నిర్వహించారు. తొలుత స్థానిక పోలేరమ్మ తల్లి ఆలయం నుంచి ప్రారంభమైంది. ఆలయంలో పూజలు జరిపి అక్కడ నుంచి అంకమ్మ తల్లి దేవాలయం వరకు మహిళలు సామూహికంగా అమ్మవారికి పసుపుకుంకుమ, చీర, గాజులు, పూలు పండ్లు, ఫలహారాలు, గోరింటాకు తదితర పూజా సామగ్రితో, మేళ తాళాల ప్రదర్శనతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజారి రాములు ప్రత్యేక అలంకరణ గావించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్, సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానాన్ని నిర్వహించారు. సాయంత్రం భజన మాస్టర్ కాకర్ల పరమేశ్వరరావు, తాళ్లూరి అశోక్ ఆధ్వర్యంలో అమ్మవారికి భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ దుప్పటి చిన్న బాబు, కోశాధికారి అత్తిపట్ల వీరాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అంకమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి అనేది ప్రజలందరికీ జగమెరిగిన సత్యమే. అధికారంలోకి రాకముందు ఇసుక ఉచితంగా అందిస్తామంటూ ప్రగల్భాలు పలికిన నాయకులు ఇప్పుడు బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అమరావతి, అచ్చంపేట మండలాల్లోని రేవుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తెస్తున్నారు. సత్తెనపల్లిలోని మన గ్రోమోర్ సెంటర్‌లో వాటిని నిలిపి భవన నిర్మాణదారులకు ఒక్కో ట్రాక్టర్ రూ.2,500 నుంచి రూ. 3 వేల వరకు బహిరంగంగా అమ్ముతున్నారు. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు జరుగుతున్నా అధికార పార్టీ అండదండలు ఉండటంతో అధికారులు కూడా కన్నెత్తి అటువైపు చూడడం లేదు. ఇప్పటికైనా నదీ పరీవాహక ప్రాంతాల్లో, ఇసుక రీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.



మన గ్రోమోర్ సెంటర్‌లో నాలుగు ట్రాక్టర్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఇసుక

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

నకరికల్లు: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నకరికల్లులో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం నిర్వహించనున్న ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కొమ్మూరి విశ్వరూపాచార్యులు సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అష్టలక్ష్మి కుంకుమ పూజలు, మండపార్చనలు, క్షీరాధివాసం, 108 రకాల విశేష ద్రవ్యాలతో దేవతామూర్తులకు స్నపన, మంత్ర పుష్పం తదితర పూజాధికాలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని విశేష పూజల్లో పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి భక్త బృందం, గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న మహా అన్నదానానికి ఏర్పాట్లు చేశారు.



అష్టలక్ష్మి కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పచ్చిరొట్ట ఎరువుతో భూమికి బలం

శావల్యాపురం: రైతులు ఒకరికొకరు పోటీపడుతూ రసాయనిక వాడకాన్ని పెంచడంతో భూమిలో సారం పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. రసాయనిక ఎరువుల వాడకం పెరగటం వలన భూమిలో సారం తగ్గిపోవటంతో దిగుబడులు తగ్గాయి. రైతులు పచ్చిరొట్ట ఎరువు సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభం ముందు రైతులు పచ్చిరొట్టి ఎరువు సాగు చేయడానికి ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలను జీలుగులు, పిల్లిపెసర, జనుము విత్తనాలతో సాగుకు సమాయాత్తం అవుతున్నారు. ఎకరానికి పది కిలోల చొప్పున చల్లాలి. విత్తనం చల్లిన నెల రోజుల తదుపరి ఏపుగా పెరిగిన తరువాత పచ్చిరొట్టను ట్రాక్టరుతో తొక్కించి భూమిలో కలిసేటట్లు దుక్కిదున్నాలి. దీంతో మొత్తం కుళ్లి భూమిలోకి ఇంకిపోతుంది. తర్వాత వారం రోజులకు గొర్రు,గుంటుక, రోటవేటరుతో భూమిని శుభ్ర పరుచుకుని పంట సాగు చేసుకోవాలి. పచ్చిరొట్ట సాగు చేసిన భూముల్లో పోషకాల శాతం పెరిగి రసాయనిక ఎరువులు వినియోగం పూర్తిస్థాయిలో తగ్గుతుంది. దీంతో రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగి రైతులు ఆర్థిక ప్రగతి సాధిస్తారు. నత్రజని, భాస్వరం, పొటాష్ సేంద్రియ రూపంలో భూమిలో కలిసిపోతాయి.



పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట ఎరువు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలోని 11 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలో లైన్‌మెయిటెన్స్ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పిడుగురాళ్ల: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎం.సైదారావు తెలిపారు. కొండమోడు, జానపాడు సబ్ స్టేషన్లలో పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్న 2 వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుర్గి మండలంలో...

దుర్గి: మండలంలోని అడిగొప్పల సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.శ్రీశైలం శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి

దుర్గి: మండలంలోని అన్నీ గ్రామాల రైతులు తప్పనిసరిగా ఈ– పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డి శుక్రవారం కోరారు. రైతు సేవా కేంద్రంలో సంప్రదించి పంట నమోదును చేయించుకోవాలని చెప్పారు. అవకాశం ఆగస్టు 14 వరకు మాత్రమే ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురుకి గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దాటిన తర్వాత 4వ మైలురాయి వద్ద శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంకొండ నుంచి గుంటూరు వేగంగా వెళుతున్న కారు 4వ మైలు రాయి వద్ద ఎదురుగా ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. దీంతో కారు అదుపుతప్పి పక్కకు దూసు కెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారులు ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రయాణికులు బాధితులను ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

బీటెక్ విద్యార్థినికి లాప్‌టాప్ బహూకరణ

అచ్చంపేట: స్నేహ హస్తాలు సౌజన్యంతో పేద బీటెక్ విద్యార్థినికి తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు అచ్చంపేటలో శుక్రవారం లాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల భవితకు బంగారు బాట వేస్తున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెలిపారు. విజయవాడ ఎస్సార్కే ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసిన మునగా ఝాన్సీలక్ష్మికి పైథాన్ ప్రాజెక్టు నిమిత్తం రూ 40వేలు విలువ చేసే లాప్‌టాప్‌ను అందజేయడం అభినందనీయని తెలిపారు. స్నేహ హస్తాలు ప్రతినిధి తాయి కరీముల్లాబాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ రవి, స్నేహ హస్తాలు ప్రతినిధి మన్నెం భద్రయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.



దోమల నివారణతోనే విషజ్వరాలు దూరం

రెంటచింతల: మన నివాస పరిసర ప్రాంతాల నుంచి దోమల నివారణతోనే మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలను దూరం చేయవచ్చునని మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో పర్యటించి వర్షాకాలంలో విషజ్వరాలు, అంటు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో అవకాశం ఉంటే మినరల్ వాటర్ తాగాలని.. ట్యాప్ వాటర్ అయితే వేడిచేసి చల్లార్చి తాగడం ఆరోగ్యానికి చాలా మంచిదని చెప్పారు. నివాస పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. మురుగునీరు ఉన్నా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా దోమ తెరలను, కిటికీలకు మెష్‌లను వాడాలని సూచించారు. పాత టైర్లు, కొబ్బరి బొండాలు ఇంట్లో ఉండకుండ ఊరికి దూరంగా పడవేయాలని కోరారు. ప్రతి శుక్రవారాన్ని కచ్చితంగా డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం వచ్చినప్పుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దీంతో వ్యాధులు మన దరి చేరవన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆంజనేయులు, సూపర్ వైజర్ ఎస్కే భాష, హెల్త్ అసిస్టెంట్లు ఖాసిం, బాలయ్య పాల్గొన్నారు.



పశర్లపాడులో నీటి తొట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

మాచర్ల రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.రవి కోరారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు ప్రాథమిక వైద్యశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని, తగిన నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. రికార్డులను పరిశీలించి పీహెచ్‌సీ వైద్యురాలు ఎల్.పద్మావతిని పలు వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని వైద్యశాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకొని ల్యాబ్‌లో జరుగుతున్న టెస్టులు, ఓపీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి డి.లక్ష్మయ్య, సూపర్‌వైజర్లు టి.నాగేశ్వరరావు, డి.మురళీధర్, కె.నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు కరిముల్లా, అరుణ తదితరులున్నారు.



కంభంపాడు పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్ఓ రవి

నేడు శ్రవణా నక్షత్ర ప్రత్యేక పూజలు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాల మధ్య కొండపై గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రవణా నక్షత్ర పూజలను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వామికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలను చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త గోపాల్ నాయక్ తెలిపారు. భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్లూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 6,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.